క్లుప్తంగా

ఉచిత యోగా శిక్షణ శిబిరం

పెనమలూరు: శ్రీవెంకటేశ్వర యోగా సేవా కేంద్ర ఆధ్వర్యంలో ఉచిత యోగా శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సేవా సంస్థ నిర్వాహకులు తెలిపారు. శుక్రవారం వివరాలు తెలుపుతూ శ్రీవెంకటేశ్వర యోగిగురూజీ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీ నుంచి 28 రోజుల పాటు ఉచిత యోగా శిక్షణ ఉంటుందన్నారు. పెనమలూరు సెంటర్ కిలారు అనీల్ ఎస్టేట్‌లో ఉదయం ఐదు నుంచి ఏడు గంటల వరకు శిక్షణ తరగతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తి కలిగిన వారు 9133306804 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ఉచిత మోకాళ్ల నొప్పుల చికిత్స

పెనమలూరు: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం కానూరు అశోక్‌నగర్‌లోని తమ కార్యాలయంలో ఉచిత మోకాళ్ల నొప్పుల చికిత్స చేస్తామని యోగాశక్తి సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మాకాల సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే మోకాళ్ల నొప్పులు, ఎవరికి వారు చికిత్స చేసుకునే విధానంపై అవగాహన కల్పిస్తామని అన్నారు. మరిన్ని వివరాలకు 9000347369 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నేడు హనుమజ్జయంతి మహోత్సవాలు

కంకిపాడు: మండలంలోని చలివేంద్రపాలెం గ్రామంలో వేంచేసిన అభయాంజనేయస్వామి దేవస్థానంలో జూన్ 1న హనుమజ్జయంతి మహోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహక ప్రతినిధి, గురుస్వామి కోసూరు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఆయన వివరాలు తెలుపుతూ శనివారం ఉదయం 7.58 గంటలకు పంచామృతాలతో స్వామివారికి అభిషేకం, ఆకుపూజ, హనుమాన్ చాలీసా, దైవ సంకీర్తన కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం అన్నసమారాధన నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. విజయ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం, మందుల పంపిణీ కార్యక్రమం జరుగుతుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కంకిపాడులో సినీనటుడు కృష్ణ జయంతి వేడుకలు



కంకిపాడు: సినీనటుడు, సూపర్‌స్టార్ కృష్ణ జయంతి వేడుకలు కంకిపాడులో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కృష్ణ 81వ జయంతి సందర్భంగా కృష్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాదచారులకు మజ్జిగ పంపిణీ చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో అజ్గర్ షరీఫ్, శ్రీరామ్, వెంకటేశ్వరరావు, కంకిపాటి సురేష్, షేక్ కరీముల్లా, రసూల్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

అటెండర్ లక్ష్మి మృతికి సంతాపం

విజయవాడరూరల్: విజయవాడరూరల్ మండల పరిషత్ కార్యాలయంలో అటెండర్‌గా పనిచేస్తూ గుండె సంబంధిత వ్యాధితో మృతి చెందిన ఈర్ల లక్ష్మి(36) మృతి పట్ల విజయవాడ రూరల్ ఎంపీపీ చెన్ను ప్రసన్నకుమారి, ఎంపీడీఓ ఎ.శ్రీరమ్య, దుగ్గిరాల ఎంపీడీఓ భార్గవి, ఈఓఆర్డీ బిఎల్‌వి.శేషగిరిరావు, కార్యాలయం సిబ్బంది శుక్రవారం సంతాపం తెలియజేశారు. మండలంలోని పలువురు సచివాలయ కార్యదర్శులు, సిబ్బంది సంతాపం తెలియజేసిన వారిలో ఉన్నారు.

7న దేవదాయ భూముల కౌలు వేలం

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామంలోని శ్రీకాశీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం భూములు ఈ నెల 7వ తేదీన కౌలు వేలం నిర్వహించనున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి ఎస్.అరుణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నున్న గ్రామానికి చెందిన ఆర్ఎస్.నెంబరు 607/2, 574/2లో ఎకరం 30 సెంట్ల మాగాణి భూమికి 2024-25 నుంచి 2026-27వ సంవత్సరం వరకు టెండర్ కమ్ బహిరంగ వేలం ఆలయ ప్రాంగణం వద్ద నిర్వహించబడునని పేర్కొన్నారు. వేలం పాటలో పాల్గొనే వారు ప్రథమ ధరావత్తు రూ. 5వేలు చెల్లించాల్సి ఉంది. ఇతర వివరాలకు కార్యాలయంలో సంప్రదించాలని ఈఓ సూచించారు.

పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

గన్నవరం: స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన 60 మంది విద్యార్థులు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ ఏ. పద్మావతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 33 మంది, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన 27 మంది విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చినట్లు పేర్కొన్నారు. వీరికి హెచ్‌ఎల్ మాండో, జీఈ ఏరోస్పేస్, శుబ్రోస్ లిమిటెడ్, రాయల్ ఎన్‌ఫీల్డ్, ఆర్ సెల్లార్ మెటల్ స్టీల్, నిప్పాన్ స్టీల్ ఇండియా, అపోలో టైర్స్ లిమిటెడ్, మేధా సర్వోడ్రైవ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీల్లో ఉద్యోగం లభించినట్లు తెలిపారు. విద్యార్థులకు నియామక పత్రాలు కూడా అందజేసినట్లు తెలిపారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను, వీరిని ప్రోత్సహించిన విభాగాధిపతులు, అధ్యాపకులను ఆమె అభినందించారు.

పెనమలూరుపై ప్రత్యేక దృష్టి

- నియోజకవర్గంలో ఎన్నికల కమిషన్ పటిష్ట చర్యలు
- పోలింగ్ రోజు గొడవలే కారణం
- శాంతిభద్రతల రక్షణలో విఫలమైన పోలీసులు
- తాజాగా ఎస్పీ స్థాయి అధికారి నియామకం
- దొంగ ఓట్లు నివారించిన వైఎస్సార్ సీపీ నేతలపైనే కేసులు



పోలింగ్‌రోజు పోరంకిలో రాళ్ల దాడి చేస్తున్న టీడీపీ మూకలు(ఫైల్)

పెనమలూరు: పెనమలూరు నియోజకవర్గాన్ని జిల్లాలోనే సమస్యాత్మకమైన నియోజకవర్గంగా ఎన్నికల కమిషన్ గుర్తించింది. ఎన్నికల రోజు జరిగిన ఘర్షణల కారణంగా పెనమలూరుపై ప్రత్యేక దృష్టి పెట్టింది. ఎస్పీ స్థాయి అధికారిని ఇక్కడ నియమించింది. కౌంటింగ్ రోజు గొడవలు జరగకుండా ఉండాలని పటిష్ట చర్యలు చేపట్టింది. గొడవలు జరిగి ఎన్నికల కమిషన్ దృష్టికి వెళ్లిన తర్వాత పోస్టుమార్టం చేపట్టారు.

పోలీసుల నిఘా విఫలం..

పెనమలూరు పోలీస్‌స్టేషన్ పని తీరు అంతంత మాత్రంగా ఉండటంతో అనేక వివాదాలకు కారణమవుతోంది. ఎన్నికల సమయంలో కూడా సరైన నిఘా లేకపోవడంతో ఘర్షణలకు తావిచ్చింది. పోలీసులు పెనమలూరు నియోజకవర్గంలో 49 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మకమైన ప్రాంతాలుగా గుర్తించారు. అయితే ఒక సామాజిక వర్గం ప్రాబల్యంతో దొంగ ఓట్లకు అడ్డాగా ఉన్న పోరంకి జిల్లా పరిషత్ పాఠశాల, సంవెద విద్యాపీఠ్ పాఠశాల్, తాడిగడప, యనమలకుదురు మండపం సెంటర్ పోలింగ్ కేంద్రంపై మాత్రం పోలీసులు దృష్టి పెట్టలేదు. ఈ కేంద్రాలను సమస్యాత్మకమైన కేంద్రాలుగా పెనమలూరు పోలీసులు, పోలీసుల నిఘా విభాగాలు గుర్తించలేదు. గత రెండు ఎన్నికల్లో ఈ ప్రాంతాల్లో గొడవలు జరిగాయి. పోలీసుల నిఘా ఘోరంగా విఫలమైంది.

హడావుడిగా కేసుల నమోదు..

పోలీసులు తమ వైఫల్యాన్ని కప్పిపుచ్చుకోవడానికి దొంగ ఓట్లు వేస్తున్న వారిని అడ్డుకున్న వైఎస్సార్ సీపీ నేతలపైనే కేసులు కట్టారు. వణుకూరులో వైఎస్సార్ సీపీ నేతలపై రౌడీషీట్లు తెరిచారు. పోరంకిలో పోలీసులపై రాళ్ల దాడి చేసిన టీడీపీ నేతలపై సామాన్య కేసులు మాత్రమే నమోదు చేశారు. పోలింగ్ రోజు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన టీడీపీ నేతలు ఘర్షణలకు కారణమైతే వారిపై కేసులు పెట్టలేదు. సనత్‌నగర్‌కు చెందిన టీడీపీ రౌడీషీటర్ పోరంకి పోలింగ్ కేంద్రం వద్ద హల్‌చల్ చేసినా పోలీసులు ప్రేక్షకపాత్ర పోషించారని విమర్శలు వెల్లువెత్తాయి. పోరంకిలో పోలింగ్ రోజు బయట నుంచి వందలాది మంది టీడీపీ మూకలు పోలింగ్ కేంద్రాల వద్ద చేరి రచ్చ చేసినా పోలీసులు ఏమీ చేయలేక పోయారు. ప్రధానంగా కాల్‌మనీ సెక్స్ రాకెట్‌లో ఉన్న నిందితులు సైతం పోరంకిలో ఎన్నికల రోజు హడావుడి చేసినా చర్యలు శూన్యం.

చేతులు కాలాక...

కౌంటింగ్ దగ్గర పడటంతో చేతులు కాలాక పోలీసులు ఇప్పుడు హడావుడి మొదలు పెట్టారు. ఎన్నికల కమిషన్ పెనమలూరులో జరిగిన గొడవలపై దృష్టి పెట్టి ఎస్పీ స్థాయి అధికారిని ఇక్కడ నియమించారు. ఇప్పుడు హడావుడిగా సమీక్షలు నిర్వహిస్తున్నారు. అయితే ఆచరణలో అల్లర్లకు సిద్ధంగా ఉన్న టీడీపీ మూకలను అదుపులోకి తీసుకుంటారా లేదా వేచి చూడాల్సి ఉంది. అలాగే రౌడీషీటర్లు, కాల్‌మనీ కేటుగాళ్లపై చర్యలు ఉంటాయా అనే ప్రశ్న తలెత్తుతోంది. ఇక్కడ పరిస్థితులను రిమోట్ కంట్రోల్‌గా నడుపుతున్న బయటి వ్యక్తులపై చర్యలు ఉంటాయా..? లేదా? ఇలా అనేక ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఇక పోలీస్‌యాక్షన్ వేచి చూడాల్సి ఉంది.

ఘనంగా ప్రారంభమైన హనుమజ్జయంతి ఉత్సవాలు



ఉయ్యూరు సువర్చలాంజనేయస్వామికి పూలు, పండ్లతో ప్రత్యేక పూజలు



శ్రీఆంజనేయస్వామికి ఆవుపాలతో అభిషేకం

దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామచంద్ర స్వామి దేవస్థానంలో హనుమజ్జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉపాలయంలోని శ్రీఆంజనేయస్వామికి విష్వక్సేనపూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎస్. రామాచార్యులు నేతృత్వంలో 16 అడుగుల ఎత్తయిన స్వామివారి విగ్రహానికి 208 లీటర్ల ఆవుపాలు, వివిధ రకాల పళ్లరసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం 41 కేజీల శ్రీచందనంతో స్వామివారికి అలంకరణ చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని శ్రీఅభయాంజనేయస్వామి ఆలయంలో కూడా జయంతి ఉత్సవాలు కొనసాగుతున్నాయి.

ఉయ్యూరులో...

ఉయ్యూరు: హనుమజ్జయంతి ఉత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. ఉయ్యూరు పట్టణంలోని సువర్చలాంజనేయస్వామి ఆలయంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం సువర్చలాంజనేయ స్వామివారికి మల్లె పూలు, పండ్లతో పూజలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ ధర్మకర్తలు గబ్బిట దుర్గాప్రసాద్, వెంకటరమణ పర్యవేక్షించారు. వంతెన సెంటరు, హనుమాన్‌నగర్‌తో పాటు పలు చోట్ల హనుమజ్జయంతి ఉత్సవాలు జరుగుతున్నాయి. ఉయ్యూరు హనుమాన్ నగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద హనుమజ్జయంతి సందర్భంగా శనివారం అన్నసమారాధన నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

ముగిసిన ఉచిత మజ్జిగ పంపిణీ



పేరంటాలమ్మ ఆలయం వద్ద మజ్జిగ పంపిణీ చేస్తున్న సిబ్బంది



కంకిపాడులో మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీవెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం ఆధ్వర్యంలో వేసవి కాలాన్ని పురస్కరించుకుని గత మూడు నెలలుగా చేపట్టిన ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రం శుక్రవారంతో ముగిసింది. ఈ వేసవిలో ప్రయాణికులు, బాటసారుల దాహార్తిని తీర్చడానికి ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో చివరి రోజు దాతలు వంగవీటి హరీష్, వంగవీటి హారిక, వంగవీటి రిషిక సహకారంతో మజ్జిగను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బోయిన భాను ప్రదీప్ మాట్లాడుతూ 90 రోజుల పాటు నిత్యం మజ్జిగను పంపిణీ చేసినట్లు తెలిపారు. దాతలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి పి.లోకేశ్వరి, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

కంకిపాడులో..

కంకిపాడు: సామాజిక సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ కంకిపాడు పట్టణ అధ్యక్షుడు తంబాబత్తుల ఓంకారం సూచించారు. ఎంపీటీసీ సభ్యుడు కోనా కిషోర్ ఆధ్వర్యంలో వేసవి ఎండల తీవ్రత దృష్ట్యా బాకీ ఏడుకొండలు, లక్ష్మీలు పట్టణంలోని అంబేడ్కర్ బొమ్మ సెంటరులో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. వేసవి దృష్ట్యా ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు.

శాంతియుత జీవనం అలవర్చుకోవాలి



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ హబీబ్‌బాషా

ఉయ్యూరు: శాంతియుత జీవనం అలవర్చుకోవాలని ఉయ్యూరు సీఐ హబీబ్‌బాషా సూచించారు. ఉయ్యూరు పట్టణ పోలీసుస్టేషన్‌లో శుక్రవారం రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. సీఐ హబీబ్‌బాషా మాట్లాడుతూ రౌడీ షీటర్లు, అనుమానితులు సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. కుటుంబాలను గుర్తెరుగుతూ బాధ్యతతో నడుచుకోవాలని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌన్సెలింగ్‌లో ఎస్ఐ గణేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు ప్రభుత్వ ఉద్యోగులు

జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్ నాయక్



శ్రీనివాసరావు దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

పెనమలూరు: ప్రభుత్వ ఉద్యోగులు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులుగా ఉండి విధులు నిర్వహించాలని జిల్లా పంచాయతీ అధికారి నాగేశ్వర్ నాయక్ పేర్కొన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఈవోపీఆర్డీ కోరా శ్రీనివాసరావు పదవీ విరమణ సందర్భంగా జరిగిన సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వ ఉద్యోగం చేసే ప్రతి ఒక్కరూ ప్రజల సమస్యలు దృష్టిలో ఉంచుకొని పని చేయాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలతో పాటు, పరిపాలన సేవలు ప్రజలకు చేరవేసే బాధ్యత ఉద్యోగులపై ఉంటుందని తెలిపారు. ఆర్డీఓ డి.రాజు మాట్లాడుతూ శ్రీనివాసరావు 40 సంవత్సరాల సర్వీసులో ఉన్నత సేవలు అందించారన్నారు. ప్రతీ ప్రభుత్వ ఉద్యోగి వారి సర్వీసులో ఎటువంటి రిమార్కు లేకుండా పని చేయాలని సూచించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎంవీఆర్.కుమార్‌బాబు, తహసీల్దార్ ప్రసాద్, డీఎల్‌పీవోలు చంద్రశేఖర్, సంపత్ కుమారి, ఏఓ లోయ శివశంకర్, డీఎల్‌డీఓ నాంచారావు, ఎంఈఓలు కనకమహాలక్ష్మి, శేషగిరిరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ, మండల పరిషత్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించాలి



వీఆర్వో రామానుజంను సన్మానిస్తున్న ఆర్డీఓ రాజు

పెనమలూరు: ప్రభుత్వ ఉద్యోగులు ఉత్తమ సేవలు అందించాలని ఆర్డీఓ డి.రాజు అన్నారు. యనమలకుదురు గ్రామానికి చెందిన వీఆర్వో ఎంఎస్.రామానుజం పదవీవిరమణ సందర్భంగా పెనమలూరు తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ రాజు మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులు రాజకీయాలకు అతీతంగా ఉద్యోగ సేవలు అందించాలన్నారు. తమ వద్దకు వచ్చే ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారం చేయాలని అన్నారు. ముఖ్యంగా రెవెన్యూ విభాగంలో ప్రజలకు అందించే సేవలు చాలా ముఖ్యమైనవి ఉంటాయని తెలిపారు. తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారు సీనియర్ల అనుభవాలను తెలుసుకోవాలని సూచించారు. అవినీతిలేని పరిపాలన ప్రజలకు అందించాలన్నారు. అనంతరం వీఆర్వో రామానుజంను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డీటీ భవాని, శ్రీనివాసరావు, ఆర్ఐ రమేష్, భరద్వాజ్, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిజికల్ డైరెక్టర్ పదవీ విరమణ

గన్నవరం రూరల్: మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌లో ఫిజికల్ డైరెక్టర్‌గా పని చేస్తున్న పి.శ్రీనివాసరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు. 2017వ సంవత్సరం నుంచి ఆయన స్థానిక హైస్కూల్ విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇచ్చారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొనేందుకు కృషి చేశారు. త్రోబాల్‌లో విద్యార్థులు పలుసార్లు విన్నర్లుగా రాణించడంలో శ్రీనివాసరావు కృషి ఎనలేనిదని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. ఉద్యోగ విరమణ సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేశారు.

ఎండ దెబ్బకు వ్యక్తి మృతి

గన్నవరం: ఎండ తీవ్రతకు తాళలేక ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని కేసరపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల సమాచారం ప్రకారం... గ్రామంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఉద్దగిరి వెంకటేశ్వరరావు(33) కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం మధ్యాహ్నం పని మీద గ్రామంలోని సెంటర్‌కు వెళ్లిన వెంకటేశ్వరరావు ఎండ దెబ్బకు తీవ్ర అస్వస్థతకు గురై అపస్మారక స్థితికి చేరుకున్నారు. కొద్దిసేపటికే వెంకటేశ్వరరావు ప్రాణాలు విడిచినట్లు అక్కడికి చేరుకున్న 108 సిబ్బంది నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



నగదు ప్రోత్సాహకాలు అందజేస్తున్న విక్టర్ రాజు కుటుంబ సభ్యులు

కంకిపాడు: విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు పీకా జేమ్స్ విక్టర్‌రాజు 13వ వర్ధంతి సందర్భంగా కుందేరు గ్రామంలో పదో తరగతిలో ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను శుక్రవారం ఆయన కుటుంబ సభ్యులు అందజేశారు. మట్టా సుజ్ఞాన జ్యోతిక (583), కొడాలి కావ్య (489), కలపాల పల్లవి (465), ఉప్పులేటి దేవికుమారి (411)లకు ఒక్కొక్కరికి మూడు వేలు చొప్పున నగదు ప్రోత్సాహకాలు అందించారు. జేమ్స్ విక్టర్‌రాజు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సతీమణి సువార్తమ్మ, కుటుంబ సభ్యులు పీకా బాలస్వామి సుధాకర్‌రావు, ఇమ్మానుయేలు, సుగుణాకర్‌రావు, సుహాసిని పాల్గొన్నారు.

జంక్షన్‌లో నేడు హనుమజ్జయంతి కార్యక్రమాలు



హనుమాన్‌జంక్షన్ రూరల్: హనుమజ్జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని హనుమాన్‌జంక్షన్‌లోని ప్రసిద్ధ అభయాంజనేయస్వామి దేవస్థానంలో శనివారం విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. వేకువజామున మూడు గంటల నుంచే ఆలయంలో అంజనీపుత్రునికి సుప్రభాత సేవ, అర్చన, పంచామృతాలతో అభిషేకం నిర్వహించనున్నారు. ఆ తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం కల్పిస్తారు. వేలాదిగా తరలివచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా దేవదాయ శాఖ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. క్యూలైన్లలో నిలబడే భక్తులకు వేసవి ఎండలను దృష్టిలో పెట్టుకుని తాగునీటి సదుపాయం ఏర్పాటు చేశారు. పరిసర గ్రామాల నుంచి తరలివచ్చే భక్తులకు ఇబ్బంది కలుగకుండా పలు స్వచ్ఛంధ సంస్థలు సైతం ప్రధాన రహదారుల వెంబడి తాగునీరు, మజ్జిగ పంపిణీ శిబిరాలను ఏర్పాటు చేస్తున్నారు. సాయంత్రం స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం పాట నిర్వహించనున్నారు. రాత్రికి అభయాంజనేయ స్వామివారిని మేళతాళాలు, డప్పు వాయిద్యాలు, లైటింగ్ సెట్టింగులతో భారీ ఊరేగింపు నిర్వహించనున్నారు.

భారీ అన్నసమారాధనకు ఏర్పాట్లు..

హనుమాన్‌జంక్షన్ లారీ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గత 41 ఏళ్లుగా హనుమజ్జయంతి పండుగ రోజున భారీ అన్నసమారాధన నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో స్థానిక విజయవాడరోడ్డులోని విఘ్నేశ్వర పంచముఖ ఆంజనేయ సహిత సీతారామ దేవస్థానం వద్ద దాదాపు 10 ఎకరాల విస్తీర్ణంలో అన్నదానం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. సుమారు 25 వేల మందికి అన్నదానం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహక కమిటీ తెలియజేసింది.

రేపు చిత్రలేఖనం పోటీలు

కృష్ణలంక(విజయవాడతూర్పు): అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా విజయవాడ గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో 2వ తేదీ మధ్యాహ్నం మూడు గంటలకు పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై చిత్రలేఖనం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఫోరం ఫర్ ఆర్టిస్ట్ బాధ్యుడు ఎ.సునీల్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాఘవయ్య పార్కు సమీపంలోని బాలోత్సవ భవన్‌లో ఎం.బి.విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్, వన్ ఎర్త్ వన్ లైఫ్ సంయుక్త ఆధ్వర్యంలో చిత్రలేఖనం పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. సబ్ జూనియర్స్ కేటగిరీలో 3, 4, 5 తరగతులకు, జూనియర్స్ కేటగిరీలో 6, 7 తరగతులకు, సీనియర్స్ కేటగిరీలో 8, 9, 10 తరగతులకు పోటీలు జరుగుతాయని తెలిపారు. పేర్లు నమోదు చేసుకున్న విద్యార్థులు మాత్రమే పోటీలకు అర్హులని పేర్కొన్నారు. డ్రాయింగ్ షీట్స్ మాత్రమే ఇస్తారని, మిగిలిన మెటీరియల్‌ను విద్యార్థులే తెచ్చుకోవాలని తెలిపారు. పోటీల అనంతరం విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్లను, పోటీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఇస్తారని వివరించారు.

మరో పదేళ్లు ఉమ్మడి రాజధానిగా హైదరాబాద్

రౌండ్‌టేబుల్ సమావేశంలో తీర్మానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హైదరాబాద్‌ను మరో పదేళ్ల పాటు ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని రౌండ్‌టేబుల్ సమావేశం తీర్మానించింది. విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం సామాజిక సంఘాలు, రాజకీయ పార్టీల ఆధ్వర్యంలో ఉమ్మడి రాజధాని అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. వక్తలు మాట్లాడుతూ 2024 జూన్ 2వ తేదీతో హైదరాబాద్ ఉమ్మడి రాజధాని గడువు ముగుస్తోందన్నారు. దీనిపై సమీక్షించి మరో పదేళ్లు హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. ఉమ్మడి రాజధాని కోల్పోతే ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర విద్యార్థులు తమ కోటాను కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. అలాగే రాష్ట్రానికి రావాల్సిన ఆస్తుల వ్యవహారం తేల్చాల్సి ఉందన్నారు. సమావేశంలో జై ఆంధ్ర డెమోక్రెటిక్ ఫోరం ప్రతినిధులు మేడా శ్రీనివాస్, కె.వినఅవధానుల హరి, కాంగ్రెస్ నేతలు షేక్ బాజీ, ప్రొఫెషనల్ ఫోరం అధ్యక్షుడు నేతి మహేశ్వరరావు, దళిత బహుజన ఫ్రంట్ ప్రతినిధులు పొందుగల ప్రకాష్, కోసనం రాము, చంద్రనాయక్, రెల్లి సంఘ నాయకులు నాగేంద్ర, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీఓఐ 666 రోజుల స్థిర డిపాజిట్ పథకం

మధురానగర్(విజయవాడసెంట్రల్): వినియోగదారుల సౌకర్యార్థం బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తగా 666 రోజుల స్థిర డిపాజిట్ పథకం ప్రారంభించినట్లు బ్యాంక్ ఆఫ్ ఇండియా విజయవాడ జోనల్ మేనేజర్ ఎంవీ బంగార్రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీని ద్వారా డిపాజిట్ చేసిన సూపర్ సీనియర్ సిటిజన్లకు ఏడాదికి 7.95 శాతం, సీనియర్ సిటిజన్లకు 7.80 శాతం, సాధారణ వ్యక్తులకు 7.30 శాతం వడ్డీ ఇవ్వనున్నట్లు వివరించారు. '666 డేస్ - ఫిక్స్‌డ్ డిపాజిట్'లో రూ. 2 కోట్ల వరకు డిపాజిట్ చేసుకోవచ్చని తెలిపారు. ఈ పథకం ఈనెల ఒకటోతేదీ నుంచి అమలులోకి వస్తుందని, ఫిక్స్‌డ్ డిపాజిట్‌పై లోన్, అకాల విత్‌డ్రా సౌకర్యం అందుబాటులో ఉందని వివరించారు. ఈ డిపాజిట్ కోసం వినియోగదారులు ఏదైనా బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో స్వయంగా గానీ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఓమ్ని నియో యాప్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలను వినియోగించుకోవచ్చని ఆయన తెలిపారు.

స్వర్ణభారత్‌లో ఉచిత ట్యాలీ శిక్షణ

ఉంగుటూరు: ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ఆవరణలో డాక్టర్ బీవీరాజు ఫౌండేషన్ సైబర్ గ్రామీణ్ శిక్షణ కేంద్రంలో ఉచిత ట్యాలీ ప్రైమ్ కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిన్ ఇంచార్జ్ అంకమ్మరావు తెలిపారు. స్థానిక విలేకరులతో శుక్రవారం ఆయన మాట్లాడుతూ ట్యాలీ ఉచిత శిక్షణకు బీ.కామ్, బీబీఏ, ఎం.కామ్, ఎంబీఏ ఉత్తీర్ణత పొందిన వారు అర్హులని చెప్పారు. అకౌంట్, ఆఫీస్ ఫైల్స్, టైపింగ్, కమ్యూనికేషన్స్‌లో ప్రత్యేక శిక్షణ అందిస్తామని వివరించారు. శిక్షణ కాలం 60రోజులు ఉంటుందని, ఉచిత భోజనం, వసతి కల్పించనున్నట్లు పేర్కొన్నారు. శిక్షణానంతరం ఉద్యోగ కల్పనలో చేయూత అందిచనున్నట్లు తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి తరగతులు ప్రారంభిస్తామని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు 9100083552 నంబరును సంప్రదించాలని సూచించారు.